జ్వాల **దశ**
నిజం.. నిర్భయంగా..
శుక్రవారం 08-05-2026



WWW.DASHANEWS.COM

## పోలీసుల ముమ్మర తనిఖీలు



**దశ ఓయూ :** నగర పోలీస్ కమిషనర్ సజ్జనర్ ఆదేశాల మేరకు గురువారం సాయంత్రం 6 గంటల నుంచి 8 గంటల వరకు ఉస్మానియా యూనివర్సిటీ పోలీసులు ముమ్మర తనిఖీలు చేపట్టారు. ప్రధానంగా జన సమర్థంగాల ప్రాంతాలు, బహిరంగ ప్రదేశాలు ఆర్ట్స్ కాలేజ్ రైల్వే స్టేషన్, తార్నాక చౌరస్తా, c గ్రౌండ్ తదితర ప్రాంతాల్లో పోలీసులు పర్యటించి బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం, మద్యపానం, గంజాయి వంటి వాటిని సేవిస్తున్న పలువురిని పట్టుకుని వారికి కౌన్సిలింగ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏసిపి జగన్, ఇన్స్పెక్టర్ మహేష్, డి ఐ లెనిన్, ఎస్సై జయ చంద్ర, కరుణాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

## పటాన్‌చెరు వ్యవసాయ మార్కెట్‌లో అభివృద్ధి పనులు

- మార్కెట్ చైర్మన్ శివానందం చేతుల మీదుగా ప్రారంభోత్సవం
- రూ. 13 కోట్ల విలువైన పునరుద్ధరణ ప్రాజెక్టుకు శ్రీకారం



**దశ, పటాన్చెరు :** పటాన్‌చెరు వ్యవసాయ మార్కెట్‌లో గత కొంతకాలంగా పెండింగ్‌లో ఉన్న నిర్మాణ పనులు ఎట్టకేలకు ప్రారంభమయ్యాయి. సుమారు రూ. 13 కోట్ల అంచనా విలువ కలిగిన ఈ అభివృద్ధి కార్యక్రమం, గత పదేళ్లుగా నిలిచిపోయిన వివిధ ప్రాజెక్టులను పూర్తి చేసే లక్ష్యంతో చేపట్టబడింది. వ్యవసాయ మార్కెట్ చైర్మన్ నాయకత్వంలో మార్కెట్ కమిటీ సభ్యులందరూ ఏకతాటిపై నడుస్తూ, ఈ దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న నిర్మాణ పనులను గురువారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మార్కెట్ చైర్మన్ శివానందం మాట్లాడుతూ, పెండింగ్‌లో ఉన్న నిర్మాణ పనులన్నీ రాబోయే ఆరు నెలల్లో పూర్తి చేసి, పటాన్‌చెరు నియోజకవర్గ ప్రజల వినియోగం కోసం అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. రైతాంగానికి మరింత మెరుగైన సేవలు అందించే దిశగా మార్కెట్‌ను మరింత బలోపేతం చేస్తామని ఆయన పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, వైస్ చైర్మన్ రాజశేఖర్, మార్కెట్ డైరెక్టర్లు,కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# కురుమ కార్పొరేషన్ ఏర్పాటు చేసిన తెలంగాణ ప్రభుత్వానికి, ప్రభుత్వ విప్ ,ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య కి కృతజ్ఞతలు

**దశ ఓయూ:** తెలంగాణ రాష్ట్రంలో కురుమ సమాజ ఆత్మగౌరవాన్ని నిలబెట్టే దిశగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న కురుమ కార్పొరేషన్ ఏర్పాటు నిర్ణయం చారిత్రాత్మకమని ఓయూ జేఏసీ నాయకులు పేర్కొన్నారు. ఓయూ జేఏసీ నాయకులు *డా. కంకల ఏలేందర్ కురుమ, డా.జంగిటి కమలాకర్ కురుమ ఆధ్వర్యంలో తెలంగాణ ప్రభుత్వానికి మరియు తెలంగాణ ప్రభుత్వ విప్ & ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఎన్నో సంవత్సరాలుగా కురుమ సమాజం కోరుతున్న ఈ న్యాయమైన డిమాండ్‌ను గత ప్రభుత్వాలు పట్టించుకోకపోయినా, కురుమ సమాజానికి ఏకైక ఎమ్మెల్యేగా ఉన్న బీర్ల ఐలయ్య ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వినతిపత్రం అందించగా, వెంటనే సానుకూలంగా స్పందించి కురుమ కార్పొరేషన్ ఏర్పాటు నిర్ణయం తీసుకోవడం హర్షణీయమని తెలిపారు. కురుమ సమాజ అభివృద్ధి, సంక్షేమం మరియు ఆర్థిక పురోగతిని దృష్టిలో పెట్టుకుని తీసుకున్న ఈ నిర్ణయం సమాజానికి కొత్త నమ్మకాన్ని,ఆత్మవిశ్వాసాన్ని ఇచ్చిందన్నారు. ప్రజా ప్రభుత్వం అన్ని వర్గాలను సమానంగా గౌరవిస్తూ, బీసీల అభివృద్ధికి పెద్దపీట వేస్తూ సామాజిక న్యాయం దిశగా ముందుకు సాగుతుండటం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, రాష్ట్ర ప్రభుత్వానికి, సంబంధిత మంత్రివర్గ సభ్యులకు మరియు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యకి కురుమ సమాజం తరపున కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఓయూ జేఏసీ నాయకులు కోరే కుమారస్వామి కురుమ, నారి మల్లేష్ కురుమ, మరాటి మల్లేశ్, రాజు, అశోక్, కృష్ణ, అనిల్, ప్రకాష్, మోహన్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.







## గోవుల సంరక్షణకు చర్యలు తీసుకోవాలి

**దశ, హైదరాబాద్ :** రాష్ట్రంలో గోవధ నిరోధక చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేసి గోవుల రక్షణకు తగు చర్యలు తీసుకోవాలని లవ్ ఫర్ కౌ ఫౌండేషన్ ట్రస్టీ రితీష్ జాగిర్దార్,శ్రీ జైన్ సేవా సంఘ్ హైదరాబాద్ పీఆర్ఓ ప్రవీణ్ పాండ్య ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు రాష్ట్ర డిజిపి సివి ఆనంద్ ఐపిఎస్ ను కలిసి విజ్ఞప్తి చేసినట్లు వారు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బక్రీద్ పండుగ సందర్భంగా విచ్చలవిడిగా గోవులను హైదరాబాద్ నగరానికి తరలించే అవకాశం ఉన్నందున ఎక్కడికక్కడ చెక్ పోస్టులను ఏర్పాటు చేసి అక్రమంగా గోవులను తరలించకుండా పోలీస్ సిబ్బందికి తగు ఆదేశాలు జారీ చేయాలని వారు కోరారు. నిత్యం వేలాధి పశువులను వధిస్తుండటంతో గోవుల సంతతి తగ్గిపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యవసాయానికి వెన్నెముకగా ఉన్న పశువులు మన ఆర్థిక వ్యవస్థకు జీవనాధారమని, శతాబ్దాలుగా మానవ మనుగడకు, సమాజానికి గోవులు ఎన్నో రకాలుగా ఉపయోగపడుతున్నాయని అన్నారు.

## డిజిటల్ సెల్ఫ్ ఎన్యుమరేషన్ పై అవగాహన సదస్సు




**దశ ( మేడిపల్లి )మేడ్చల్ జిల్లా:** మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బోడుప్పల్ సర్కిల్10 లో భారత జనగణన 2027లో భాగంగా డిజిటల్ సెల్ఫ్ ఎన్యుమరేషన్ పై గురువారం మేడిపల్లి పోలీస్ స్టేషన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా డిసి శైలజ, మాట్లాడుతూ..డిజిటల్ సెల్ఫ్ ఎన్యుమరేషన్ విధానం, దాని ప్రాముఖ్యత, ప్రజలకు కలిగే సౌలభ్యాల గురించి సిబ్బందికి వివరించారు. మేడిపల్లి పోలీస్ స్టేషన్ సిబ్బంది అందరూ గురువారం రోజున విజయవంతంగా సెల్ఫ్ ఎన్యుమరేషన్ పూర్తి చేశారు. ప్రజలు కూడా డిజిటల్ విధానాన్ని వినియోగించి జనగణన ప్రక్రియలో భాగస్వాములు కావాలని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు కృష్ణయ్య, తిరుపతయ్య, కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు జెన్నరాజు, సుధాకర్, సదానంద్, ఎల్లయ్య, సాయి, తదితరులు పాల్గొన్నారు.

# పాత పాలకవర్గాలకే మళ్లీ బాధ్యతలు



- కోర్టు ఆదేశాలను అమలు చేసిన అధికారులు
- చైర్మన్లుగా బాధ్యతలు స్వీకరించిన
- గోనె ప్రతాప్ రెడ్డి, దేవర వెంకట్ రెడ్డి

**దశ,చేవెళ్ల:** ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల(పీఏసీఎస్) గత పాలకవర్గాలకే తిరిగి బాధ్యతలు అప్పగించాలని ఇటీవల హైకోర్టు తీర్పు వెల్లడించడంతో ముడిమ్యాల మాజీ చైర్మన్ గోనె ప్రతాప్ రెడ్డి, చేవెళ్ల మాజీ చైర్మన్ దేవర వెంకట్ రెడ్డి లతో పాటు ఆ పాలకవర్గాల డైరెక్టర్లు గురువారం బాధ్యతలు స్వీకరించారు. గత ఏడాది ఫిబ్రవరి 14తో పీఏసీఎసులో పాలకవర్గాల గడువు ముగియడంతో ప్రభుత్వం డిసెంబరు 19వరకు గడువును పొడిగించింది. ఆ తరువాత ప్రభుత్వం గడువు పొడిగించకుండా పీఏసీఎస్ లకు ప్రత్యేకాధికారులను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ప్రాథమిక సహకార సంఘాలకు ప్రత్యేకాధికారులను నియమించే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి లేదంటూ రాష్ట్రంలోని పలు పీఏసీఎస్ మాజీ చైర్మన్లు హైకోర్టును ఆశ్రయించారు.

వాదోపవాదాల అనంతరం హైకోర్టు ఇటీవల తీర్పును వెల్లడించింది. తక్షణమే మాజీ చైర్మన్లకు, ఆయా పాలకవర్గాల డైరెక్టర్లకు బాధ్యతలు అప్పగించాలని ఆదేశాలు జారీ చేసింది. కోర్టు ఆదేశాల మేరకు పాత పాలకవర్గాలకే బాధ్యతలు అప్పగిస్తూ జిల్లా డీసీవో రెండు రోజుల క్రితం ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో గురువారం చేవెళ్ల, ముడిమ్యాల పీఏసీఎస్ చైర్మన్లతోపాటు పాలవర్గ డైరెక్టర్లు బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆ పీఏసీఎసుల సీఈఓలు చైర్మన్లతో పాటు డైరెక్టర్లను శాలువాలతో ఘనంగా సత్కరిస్తూ బాధ్యతల ఉత్తర్వుల కాపీలను అందజేశారు. ఈ సందర్భంగా ఆ పీఏసీఎసుల చైర్మన్లు గోనె ప్రతాప్ రెడ్డి, దేవర వెంకట్ రెడ్డిలు మాట్లాడుతూ.. హైకోర్టు తీర్పుతో రైతులకు మరికొంత కాలం సేవ చేసే అవకాశం రావడం చాలా ఆనందంగా ఉందన్నారు. రైతులకు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అమలయ్యే విధంగా కృషి చేస్తామన్నారు.

ఈ కార్యక్రమంలో ముడిమ్యాల పీఏసీఎస్ ఉపాధ్యక్షులు మల్లేష్, డైరెక్టర్లు పడాల రాములు, రాఘవరెడ్డి, సునీల్ చారి, శివకుమార్ రెడ్డి, మాధవరెడ్డి, ప్రవీణ్ రెడ్డి, శివరాజ్, నరేందర్, ఉపేందర్ సింగ్, లక్ష్మయ్య, బాలమ్మ, సీఈవో భరత్ కుమార్, గ్రామ సర్పంచ్ శ్రీనివాస్, ఉప సర్పంచ్ జంగారెడ్డి, తదితరులు, చేవెళ్లలోని కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ దేవర సమతా వెంకట్ రెడ్డి, వైస్ చైర్మన్ కాసుల రాములు గౌడ్, చేవెళ్ల మాజీ జడ్పీటీసీ చింపుల శైలజ సత్యనారాయణ రెడ్డి, కౌన్సిలర్లు పైండ్ల మధుసూదన్ రెడ్డి, తాళ్లపల్లి నర్సిములు, మాజీ ఉపసర్పంచ్ టేకులపల్లి శ్రీనివాస్, నాయకులు అత్తెల్లి రవీందర్ రెడ్డి, మల్గారి శ్రీకాంత్ రెడ్డి, తదితర నాయకులు, సహకార సంఘం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ భద్రత ప్రతి పౌరుడి బాధ్యత: ఏఈ మణిదీప్

- రైతు వేదికలో విద్యుత్ భద్రతపై అవగాహన సదస్సు
- ప్రమాదాల నివారణకు అప్రమత్తతే ఏకైక మార్గం



**దశ, అశ్వాపురం:** విద్యుత్ భద్రత అనేది కేవలం ఒక శాఖ బాధ్యత మాత్రమే కాదని, అది ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అని అశ్వాపురం విద్యుత్ శాఖ ఏఈ మణిదీప్ స్పష్టం చేశారు. 'ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక'లో భాగంగా మండలంలోని మల్లెలమడుగు రైతు వేదికలో గురువారం విద్యుత్ భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రైతులు, స్థానిక ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. విద్యుత్ వినియోగంలో చిన్నపాటి నిర్లక్ష్యం కూడా తీవ్రమైన ప్రాణ, ఆస్తి నష్టాలకు దారి తీస్తుందని ఏఈ హెచ్చరించారు. ముఖ్యంగా వ్యవసాయ పనుల్లో రైతులు విద్యుత్ వైర్ల విషయంలో అత్యంత అప్రమత్తంగా ఉండాలన్నారు. నాణ్యమైన విద్యుత్ సేవలు అందించడమే కాకుండా, ప్రమాద రహిత సమాజాన్ని నిర్మించడమే విద్యుత్ శాఖ లక్ష్యం. విద్యుత్ లైన్ల వద్ద లేదా ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఏదైనా ప్రమాద సూచన గమనించిన వెంటనే అధికారులు లేదా సిబ్బందికి సమాచారం అందించాలి" అని కోరారు. విద్యుత్ సమస్యలు లేదా అత్యవసర పరిస్థితుల్లో ఫిర్యాదు చేసేందుకు 24 గంటలు అందుబాటులో ఉండే 1912 టోల్ ఫ్రీ నంబరును సంప్రదించాలని సూచించారు. అధికారులు, సిబ్బంది సమన్వయంతో నాణ్యమైన విద్యుత్ అందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ సిబ్బంది, స్థానిక రైతులు మరియు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రాష్ట్రానికి బీఆర్ఎస్ శ్రీరామరక్ష

- బీఆర్ఎస్ పార్టీ శాసనసభ పక్ష ఉప నేత హరీష్ రావు



**దశ, మునగాల:** , (మే 07): రాష్ట్రానికి బీఆర్ఎస్ పార్టీ ,కేసీఆర్ నాయకత్వమే శ్రీరామరక్ష అని బీఆర్ఎస్ పార్టీ శాసనసభపక్ష ఉపనేత తన్నీరు హరీష్ రావు అన్నారు, గురువారం కోదాడలో నిర్వహించే బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గస్థాయి సమావేశానికి హాజరయ్యేందుకు వెళుతున్న హరీష్ రావు కు మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు మునగాలమండల కేంద్రంలోని జాతీయ రహదారిపై ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా హరీష్‌రావుకు స్థానిక మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ పుష్పగుచ్చం అందించి ఘనంగా సన్మానించారు. అనంతరం పార్టీ నాయకులు కార్యకర్తలు, రాష్ట్ర జిల్లా నేతలతో కలిసి స్థానిక తెలంగాణ తల్లి విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కార్యకర్తల్ని ఉద్దేశించి హరీష్ రావుమాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ప్రజల హక్కులకు ఎక్కడ నష్టం వాటిల్లిన తెలంగాణ భాష యాస సంస్కృతి సాంప్రదాయాలకు రాష్ట్ర అస్తిత్వం పై ఎక్కడ దాడి జరిగినా బీఆర్ఎస్ పార్టీ చూస్తూ ఊరుకోదని రాష్ట్ర ప్రజల పక్షాన ప్రజాపోరాటానికి సిద్ధమవుతూ పాలకపక్షాలను ఎండగడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్, మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్, చిరుమర్తి లింగయ్య, నోముల భగత్, కుసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, నల్లగొండ జిల్లా మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ బండా నరేందర్ రెడ్డి, బిఆర్ఎస్ రాష్ట్రనేత రాకేష్ రెడ్డి, స్థానిక బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు తొగరు రమేష్ సుంక అజయ్ కుమార్, కందిబండ సత్యనారాయణ, రామ్ రెడ్డి, తొగరు సీతారాములు, కోళ్ల ఉపేందర్, సర్పంచులు సురేందర్ రెడ్డి, బుసి వెంకటేశ్వర్లు, మొగిలిచర్ల సత్యనారాయణ, సుందరయ్య, నాగిరెడ్డి, ఉడుంకృష్ణ, ఎల్ పి రామయ్య తదితరులు పాల్గొన్నారు.





# కరీంనగర్ లో బిజెపి రౌడీయిజాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం

❖ పినపాక మాజీ ఎమ్మెల్యే, ప్రభుత్వ మాజీ విప్ రేగా కాంతారావు



**దశ, భద్రాద్రి కొత్తగూడెం:** బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి , మాజీ మంత్రి గంగుల కమలాకర్ ఇండ్లు , కారు మీద దాడి హేయమైన చర్య అని పినపాక మాజీ ఎమ్మెల్యే, ప్రభుత్వ మాజీ విప్ రేగా కాంతారావు దాడిని ఖండించారు. గురువారం కొత్తగూడెంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బిజెపి రౌడీయిజాన్ని గూండాయిజాన్ని నమ్ముకున్నది. తెలంగాణలో బిజెపి గుండాగిరి నడవదన్నారు. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రిగా ఉన్న బండి సంజయ్ స్వయంగా హింసను ప్రేరేపించడం సిగ్గుమాలిన చర్యన్నారు. బండి సంజయ్ తక్షణం రాజీనామా చేయాలన్నారు. ప్రధానమంత్రి మోడీకి ప్రజాస్వామ్యం మీద గౌరవం ఉంటే బండి సంజయ్ ని కేంద్ర మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలి. బిజెపి దాడులకు కౌంటర్ గా బీఆర్ఎస్ కార్యకర్తలు దాడులు చేస్తే మీరు రోడ్లమీద తిరగగలరా...? 60 లక్షల మంది మా కార్యకర్తలు ఎదురు తిరిగితే ఒక్క బీజేపీ నేత కూడా బయటకి రాలేడు. బండి సంజయ్ గాని బిజెపి నేతలు గాని ఒళ్ళు దగ్గర పెట్టుకుని రాజకీయాలు చేయాలి.మా అధినేత కేసిఆర్, మా యువనేత కేటీఆర్ పైన ఇష్టం వచ్చినట్లు ఆరోపణ చేస్తే ప్రజాస్వామ్య బద్ధంగా బుద్ధి చెబుతాం. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శిస్తే బిజెపి నేతలు దాడి చేయడం ఏమిటి..? రేవంత్ రెడ్డి కోసం బండి సంజయ్ పనిచేస్తున్నారా..??

కాంగ్రెస్ బిజెపి కుమ్మక్కు రాజకీయాల వల్లే బీఆర్ఎస్ పైన దాడులు చేస్తున్నారా..? ఖబర్దార్ బిజెపి నేతల్లారా.. మా ఓపిక, క్రమశిక్షణను చేతకానితనంగా తీసుకోవద్దు. బీఆర్ఎస్ కార్యకర్తలు తిరగబడితే ఎలా ఉంటుందో తెలుసుకొని పద్ధతిగా రాజకీయాలు చేయండి..

# పోలీసులపై కత్తితో దాడికి యత్నం

❖ నిందితుడు అరెస్ట్

**దశ, మణుగూరు:** మద్యం సేవించి వాహనం నడపడమే కాకుండా, తనిఖీలు చేస్తున్న పోలీసులపై కత్తితో దాడికి యత్నించిన వ్యక్తిని మణుగూరు పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. గురువారం సాయంత్రం మణుగూరు పోలీసులు స్థానిక సమ్మక్క సారక్క ఆలయం వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఆ సమయంలో తోగ్గూడెం గ్రామం నుండి ఒక వ్యక్తి బైక్‌పై వస్తుండగా పోలీసులు అతడిని ఆపి తనిఖీ చేశారు. డ్రంకెన్ డ్రైవ్ పరీక్ష నిర్వహించగా, సదరు వ్యక్తికి 80 BAC శాతం నమోదైంది. దీంతో పోలీసులు నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుని, అతడిని ఇంటికి పంపించివేశారు.

పోలీసులు పరీక్ష నిర్వహించారన్న కోపంతో, కొద్దిసేపటి తర్వాత నిందితుడు ఇంటి నుండి కత్తితో తిరిగి ఘటనా స్థలానికి చేరుకున్నాడు. "నాకు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ చేస్తారా?" అంటూ కేకలు వేస్తూ విధుల్లో ఉన్న పోలీసులపై దాడికి యత్నించాడు. అప్రమత్తమైన పోలీసులు అతడిని నిలువరించి, ప్రభుత్వ విధులకు ఆటంకం కలిగించినందుకు కేసు నమోదు చేశారు. దాడికి యత్నించిన వ్యక్తిని తోగ్గూడెం గ్రామానికి చెందిన సోలెం నాగేశ్వరరావుగా పోలీసులు గుర్తించారు. నిందితుడిని అరెస్ట్ చేసి, కోర్టులో హాజరుపరిచిన అనంతరం జ్యూడిషియల్ రిమాండ్‌కు తరలించారు.

## ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో విద్యుత్ శాఖ ప్రత్యేక సమావేశం



**దశ, పినపాక:** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా పినపాక మండలంలో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో గురువారం పినపాక రైతు వేదికలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి పినపాక విద్యుత్ శాఖాధికారి వేణుగోపాల్, ఎంపీడీవో సంకీర్త్, స్పెషల్ ఆఫీసర్ తాతారావు, అగ్రికల్చర్ ఏవో వెంకటేశ్వర్లు హాజరయ్యారు. అలాగే వివిధ గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచులు, స్థానిక నాయకులు రైతులు పాల్గొని తమ సమస్యలను తెలియజేశారు.సమావేశంలో గ్రామాల్లో విద్యుత్ సమస్యలు, ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులు, వ్యవసాయ విద్యుత్ సరఫరా, వేసవి కాలంలో అంతరాయం లేకుండా విద్యుత్ అందించే చర్యలపై చర్చించారు. రైతులకు సోలార్ మోటార్ల వినియోగంపై అధికారులు అవగాహన కల్పించారు. సోలార్ మోటార్ల వల్ల విద్యుత్ ఖర్చులు తగ్గడంతో పాటు పగటి వేళల్లో నిరంతరాయంగా నీటి సరఫరా పొందవచ్చని వివరించారు. పర్యావరణ పరిరక్షణకు కూడా ఇవి దోహదపడతాయని తెలిపారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో 23 గ్రామపంచాయతీలు సర్పంచులు, ఉప సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ షిరిడి సాయిబాబా ఆలయంలో భక్తులకు మజ్జిగ పంపిణీ

**దశ, మణుగూరు:** మణుగూరు పట్టణంలో గల శ్రీ శిరిడి సాయిబాబా ఆలయంలో అశోక్ నగర్ వాస్తవ్యులు, సతీష్ గురు స్వామి ఆధ్వర్యంలో గురువారం భక్తులకు వేసవి నేపథ్యంలో మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మార్కండేయ పీఠం గురుస్వామి సతీష్ స్వామి మాట్లాడుతూ, ప్రతి గురువారం బాబా భక్తులకు మజ్జిగ పంపిణీ చేస్తామని తెలిపారు. బాబా వారి కృప కటాక్షాలుప్రతి కుటుంబం పై ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు దోసపాటి నాగేశ్వర రావు, చక్కా బాలకేశవరావు, ఆలయ అర్చకులు V.S పవన్ కుమార్ శర్మ, ఆలయ గుమస్తా వెంకన్న, సాయి సేవకులు, బావ వత్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించి స్వామివారి సేవలో పాల్గొన్నారు.

## పర్సనల్ మేనేజర్ తిరుపతి నీ సన్మానించిన తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం



**దశ, కొత్తగూడెం :** కొత్తగూడెం ఏరియా వైస్ ప్రెసిడెంట్ గడప రాజయ్య ఆధ్వర్యంలో మణుగూరు నుండి కొత్తగూడెం ఏరియా కు ట్రాన్స్ఫర్ మీద వచ్చిన పర్సనల్ మేనేజర్ తిరుపతిని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర సందర్భంగా కాపు కృష్ణ ముఖ్య ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ ఏ సమస్య అయినా పారదర్శకంగా పరిష్కరించాలని ఎటువంటి అవకతవకలు లేకుండా చూడాలని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో సెంట్రల్ కమిటీ సభ్యులు వసికార్ల కిరణ్, కాగితపు విజయ్ కుమార్, బూర్గుల రవికుమార్, మాదాసు ఈశ్వరయ్య, ఫిట్ సెక్రటరీ సూరజ్, వెంకటేశ్వర్లు, మురళి, ద్యాసాగర్, శ్రీకాంత్, తిరుపతి, అన్వర్, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రైవేట్ స్కూల్ వద్దు ప్రభుత్వ స్కూల్లో ముద్దు

**దశ, మణుగూరు:** అధిక భారాన్ని మించి ప్రైవేట్ స్కూళ్లలో తమ పిల్లలను చేర్పించవద్దని, నాణ్యమైన విద్యాబోధనను అందిస్తున్న ప్రభుత్వ స్కూళ్లలోనే తమ పిల్లల్ని చేర్పించాలంటూ తల్లిదండ్రులకు, విద్యార్థులకు మణుగూరుకు చెందిన సామాజిక కార్యకర్త అడ్వకేట్ కర్నే రవి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా గురువారం ప్రభుత్వ మరియు ప్రభుత్వ రంగ సింగరేణి పాఠశాలల్లో చదివినటువంటి 10వ తరగతి విద్యార్థిని విద్యార్థులకు రవి ఘనంగా సన్మానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన సౌకర్యాలు విద్యాబోధన ఉందని, తల్లిదండ్రులు అధిక భారాన్ని మించి ప్రైవేట్ స్కూళ్లలో తమ పిల్లల్ని చదివించవద్దని, నాణ్యమైన విద్య బోధన అందించే ప్రభుత్వ పాఠశాలలోనే తమ విద్యార్థులను చేర్పించాలని కోరారు. అనంతరం సింగరేణి ప్రభుత్వ పాఠశాలలో చదివిన భవ్య శ్రీ 540 మార్కులు, వికాస్ 563 మార్కులు మరియు మణుగూరు గవర్నమెంట్ స్కూల్లో చదివిన విజయ్ 503 మార్కులు తెచ్చుకున్న సందర్భంగా వారి ముగ్గురిని ఘనంగా సత్కరించారు.

# సారపాక విద్యుత్ శాఖ AEపై చర్యలు తీసుకోవాలి



❖ మణుగూరు మాజీ జడ్పీటీసి పాల్వంచ దుర్గ

**దశ, మణుగూరు:** సారపాక విద్యుత్ శాఖలో అసిస్టెంట్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న ఉపేందర్ అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని ఆరోపిస్తూ మణుగూరు మండల మాజీ జడ్పీటిసి పాల్వంచ దుర్గ డివిజనల్ ఇంజనీర్ భద్రాచలం డివిజన్‌కు గురువారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంత చట్టాలను ఉల్లంఘిస్తూ గిరిజనేతరులకు కమర్షియల్ వినియోగాల కోసం నిబంధనలకు విరుద్ధంగా కేటగిరీ 1 మీటర్లు మంజూరు చేస్తున్నారని ఆమె ఆరోపించారు. అలాగే అసలు ఇళ్లు లేని ప్రాంతాల్లో కూడా అక్రమంగా మీటర్లు మంజూరు చేయడం, ప్రభుత్వ మరియు అటవీ భూములపై నిర్మించిన అక్రమ కట్టడాలకు విద్యుత్ కనెక్షన్లు ఇవ్వడం జరుగుతోందన్నారు. గతంలో సారపాకలో జరిగిన విద్యుత్ కాంట్రాక్టు పనుల్లో జరిగిన అక్రమాలపై విజిలెన్స్ అధికారులు ప్రాథమిక విచారణలో ఉపేందర్ పాత్ర ఉన్నట్లు తేలిందని, అయినప్పటికీ ఉన్నతాధికారులను ప్రభావితం చేస్తూ తనపై చర్యలు తీసుకోకుండా చూస్తున్నారని ఆరోపించారు. ఈ అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించి, సంబంధిత అధికారిపై కఠిన శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని మాజీ జెడ్పీటిసి పాల్వంచ దుర్గ డిమాండ్ చేశారు.

## లంచం తీసుకుంటూ ACB కి చిక్కిన భద్రాచలం FDO , ఇంచార్జ్ DRO

❖ రూ.3.50 లక్షల లంచం తీసుకుంటుండగా పట్టుకున్న ACB అధికారులు



**దశ, భద్రాచలం:** భద్రాచలం డివిజన్ పరిధిలో చర్ల మండలం పూసుకుప్ప ప్రాంతంలో ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో సంబంధిత కాంట్రక్టర్ రోడ్డు వేస్తున్న క్రమంలో కొన్ని ప్రాంతాలలో రోడ్డు పక్కన ఉన్న చెట్లు దెబ్బతిన్నాయి. దెబ్బతిన్న చెట్లు కారణంగా కేసు నమోదు చేయకుండా ఉండేందుకు సంబంధిత అటవీశాఖ భద్రాచలం డివిజన్ అధికారి సుజాత, చర్ల ఇన్‌ఛార్జ్ డీఆర్‌ఓ కృష్ణయ్యలు రూ.10 లక్షలు డిమాండ్ చేశారు. దీంతో సంబంధిత కాంట్రాక్టర్ ఏసీబీ అధికారులకు సమాచారం ఇచ్చి జరిగిన విషయం పూర్తి వివరాలతో తెలియజేశాడు. ప్రస్తుతానికి రూ 3.5 లక్షలు లంచం ఇచ్చేందుకు సదరు కాంట్రాక్టర్ ఒప్పుకొని గురువారం ఆ డబ్బులు ఇచ్చేందుకు భద్రాచలం FDO కార్యాలయానికి వెళ్లారు. డబ్బులు ఫారెస్ట్ అధికారులు తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్ గా ఖమ్మం ఏసీబీ డీఎస్పీ వై.రమేష్ ఆధ్వర్యంలో అధికారులు పట్టుకున్నారు. పట్టుబడ్డ అటవీ శాఖ అధికారులు భద్రాచలం ఎఫ్డిఓ సుజాత, చర్ల ఇన్‌ఛార్జ్ డీఆర్‌ఓ కృష్ణయ్యలపై కేసు నమోదు చేసి ఏసీబీ కోర్టుకు తరలించారు.

# మల్లారం, పోట్లపల్లి గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలి



**దశ, పినపాక:** మండల పరిధిలోని మల్లారం, పోట్లపల్లి గ్రామాల మీదుగా ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించలని మల్లారం సర్పంచ్ ఇర్పా సాంబశివరావు డిమాండ్ చేశారు. గురువారం మల్లారం గ్రామపంచాయితీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గిరిజన గ్రామాలైన మల్లారం, పోట్లపల్లి, గడ్డంపల్లి గ్రామాల మీదుగా మణుగూరు ఆర్టీసీ డిపో బస్సును నడపాలని ఆయన డిమాండ్ చేశారు. పాతరెడ్డిపాలెం నుండి మణుగూరు మీదుగా నడిపిస్తున్న బస్సు సర్వీసు మాదిరిగానే మల్లారం, పోట్లపల్లి మీదుగా బస్సు సౌకర్యం కల్పించాలన్నారు. పేద ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. వెంటనే మణుగూరు ఆర్టీసీ డిపో అధికారులు ఈ మూడు గ్రామాల్లో సర్వే నిర్వహించి బస్సు సౌకర్యం ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో మల్లారం ఉప సర్పంచ్ కొమరం రాధాబాయి, మేకల శిరీషా, దాట్ల మోహన్‌రావు, గలిగె రమేష్, సోయం చుక్కయ్య, పోలెబోయిన నారాయణ, వాడ సాంబ, మడవి భీమయ్య, ఖాదర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

# పినపాక VOAల సొమ్ము నోటీస్

**దశ, పినపాక :** తెలంగాణ రాష్ట్ర VOAల JAC పిలుపు మేరకు గురువారం పినపాక మండల VOAలు ఏపీయం విజయకుమారికి సమ్మె నోటీస్ ఇచ్చారు. ఈనెల 18వ తేదిన నుండి శాంతియుతంగా నిరవధిక సమ్మె చేయాలని సంఘం నిర్ణయం తీసుకున్నారు. IKPలో సుధీర్ఘకాలం నుండి పని చేస్తున్న వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. అదేవిధంగా నెలకు రూ.20 వేలు వేతనం ఇవ్వాలని, జీవిత భీమా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి ఒక్కరికి ట్యాబ్ పంపిణీ చేయాలని, సీనియర్లకు సీసీలుగా పదోన్నతి కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో VOAలు ధనలక్ష్మి, ధనలక్ష్మి, రాజేశ్వరి, నాగప్రమీల, ఉండం బాబూరావు, ఝాన్సీ, నాగేశ్వరావు, పద్మా, కళావతి, సుజాత, రజిని, స్వరూప, శ్రీదేవి, బడే శ్రీను, జగదీష్, వరలక్ష్మి, శ్రీవేణి, యశోద, శివలీల తదితరులు పాల్గొన్నారు.

